జిబి సిండ్రోమ్ వ్యాధిగ్రస్థ బాలిక వైద్యానికి సహకరించాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : గత కొన్నేళ్లుగా మంచానికే పరిమితమై జి బి సిండ్రోమ్ వ్యాధితో చికిత్స పొందుతున్న ద్వారకానగర్ కు చెందిన చిన్నారి కావ్య చికిత్సకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రంలోని దాతలు చేయూత నిచ్చి సహకరించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కోరారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్) విశాఖ నగర కమిటీ ప్రతినిధులు సమకూర్చిన 15 వేలు రూపాయల ఆర్థిక సాయాన్ని ఆదివారం ద్వారకానగర్ లోని బాలిక స్వగృహానికి వెళ్లి సీతారాం చేతులు మీదుగా చిన్నారి తండ్రి హరికుమార్ కు అందించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ జి బి సిండ్రోమ్(గులియన్ బ్యారీ సిండ్రోమ్) అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి వైద్య పరీక్షల్లో వైటల్స్ గా పిలవబడే నాడీ,రక్త పోటు సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ అనారోగ్యమంతా ఆచేతనత్వంతో ఉంటుందని అన్నారు. కాళ్ళు, చేతులు, మెడ, కందరాలు, ఒక్కోసారి ఆచేతనం వల్ల కళు మూసు కోవడం కష్టతరం గల ఈ వ్యాధికయ్యే వ్యయం కూడా ఎక్కువ కావడం ఇప్పటికే 50 లక్షలు అప్పులు చేసి వివిధ ఆసుపత్రుల్లో వైద్యం చేయించిన ఈమె తండ్రి రైల్వే ఉద్యోగానికి సైతం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారని అన్నారు,తండ్రి పెన్షన్ తోనే అరకొర వైద్య సేవలు అందిస్తు ఇక తాము ఆర్థికంగా తట్టుకోలేమని, వైద్యాన్ని నిలిపేస్తామని కన్నీటి పర్యంతంతో వాపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో తమ వంతు సాయంగా నిలవడంతో పాటు కుటుంబ సభ్యులకు వెన్ను దన్నుగా ఉంటామని అన్నారు. ఈ తరుణంలో రాష్ట్రం ప్రభుత్వం, దాతలు చేయూతనిచ్చి బాలిక వైద్యానికయ్యే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ తామని అన్నారు. దాతృత్వం గల దాతలు చిన్నారి తండ్రి ఫోన్ పే నంబర్ 9848323144 లేదా కెనరా బ్యాంక్ అకౌంట్ నెంబర్ 35802010060107, ఐఎఫ్ఎస్సి కోడ్ నెంబర్,సిఎన్ఆర్బి 0013580 నెంబర్లకు ఆర్థిక సాయాన్ని పంపించి పునర్జన్మ ప్రసాదించాలని కోరుతున్నామని సీతారాం అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టా ఫౌండేషన్ అధినేత పట్టా రమేష్,చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.శకుంతల,ఫోరం నగర కన్వీనర్ కె.ఎల్లయ్య, సలహాదారు డాక్టర్ ఆది మూర్తి,కార్యదర్శి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీని సందర్శించిన అధికారుల బృందం

విశాలాంధ్ర - పరవాడ : పరవాడలోని సింహాద్రి ఎన్టీపీసీ పరిశ్రమను శనివారం సంస్థ డైరెక్టర్(ఆపరేషన్స్) వి.రమేశ్ బాబు, సదరన్ ఈడీ శ్రీదేబాశిష్ ఛటోపాధ్యాయ, ఏఎస్ఎస్సి ఈడీ సి. శివకుమార్ సందర్శించారు. వీరికి సింహాద్రి జీజీఎం సంజయ్ కుమార్ సిన్హా స్వాగతం పలికారు. అనంతరం అధికారుల బృందం ప్లాంట్‌లోని అన్ని విభాగాలతో పాటు పవర్ కంట్రోల్ రూమ్, యాష్ పాండ్‌ను పరిశీలించారు. తుక్కు నియంత్రణ, రక్షణకు సంబంధించి ప్రెజెంటేషన్ చేశారు. ప్లాంటులో జరుగుతున్న ఎఫ్‌జీడీ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ జీఎంలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శ్రీ మోదకొండమ్మ జాతర విజయవంతం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - అల్లూరి జిల్లా : పాడేరులో వేంచేసిన శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర విజయవంతం అవ్వడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు పిలుపునిచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, జాతర విజయ వంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం జూనియర్ కళాశాల వేదికగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలక్టర్, జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ జె.సుభద్ర, శాసన మండలి సభ్యులు కె భాగ్యలక్ష్మి, చెట్టి ఫల్గుణ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తదితరులు సాంప్రదాయ పద్దతిలో తుడుము డప్పు వాయించి జాతర ఉత్సవాలు ప్రారంభం అయినట్లు ప్రకటించారు. పాడేరు శాసనసభ్యులు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా ఇన్చార్జి మంత్రి గుడివాడ అమర్నాథ్ అందించిన సహకారం కు ధన్యవాదములు తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్పర్సన్, అరకు ఎమ్మెల్యే, ట్రైకార్ ఛైర్పర్సన్ మాట్లాడుతూ జాతర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

తల్లి తొలి గురువు : అనసూయ

విశాలాంధ్ర - మల్కాపురం : ప్రతి ఒక్కరికి తల్లి తొలి గురువని, స్నేహశీలి , త్యాగమయి అనీ జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం ఆమె రిసోర్స్ పర్సన్ గా మాట్లాడుతూ తల్లిని గౌరవిస్తే సమస్త దేవతలను పూజించినట్లే అని అన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులకు తగిన గౌరవాన్ని ఇవ్వాలని ఆమె అన్నారు. ఆదివారం మాతృ దినోత్సవం సందర్భంగా 'తల్లిపై తమ భావాలను' చిన్నారులు పంచుకున్నారు మీ దృష్టిలో తల్లి అంటే ఎవరు ? అనే ప్రశ్నకు చిన్నారులు అద్భుతమైన సమాధానాలు ఇచ్చి ఆశ్చర్యపరిచారు. తల్లి ఒక అనుభూతి అని, ఒక అనురాగమని, త్యాగానికి ప్రతీక అని, సహనశీలి అని, తమ కష్టాలలో భాగం పంచుకునేదని, మన చిరునవ్వుకు కారణమని, మన జీవితానికి ఒక అర్థం అని వారు చెప్పిన సమాధానాలు ఆలోచింపచేసాయి. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ రచయిత కె.సత్తిరాజు సమన్వయ పరిచారు. ఆయన సీనియర్ విద్యార్థులతో కలిసి తయారుచేసిన నౌకను బాలలు ఆసక్తితో తిలకించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992 - 93 బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం వేములవలస బీపీ కల్లాలు రోడ్లో గల శుభశ్రీ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. అప్పటి ఎస్‌పిఎల్ పతివాడ రమణ మాస్టర్, పూర్వ విద్యార్థి ప్రస్తుతం ఎస్ఐ బోరపు మంగ రాజు ఆధ్వర్యంలో సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 10వ తరగతి చదువుకొని నేటికీ 30 సంవత్సరాల పూర్తిచేసుకుని అందరూ ఒకచోట కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 45 సంవత్సరాలు వయసుగల పాత విద్యార్థులంతా ఒకచోట చేరి యోగక్షేమాలు, కష్టసుఖాలు ఈ ఆత్మీయ సమ్మేళన ఒక కుటుంబ సభ్యులుగా భవిష్యత్తు కాలంలో పలు సేవా కార్యక్రమాలు చేయడానికి నాంది కావాలన్నారు. కార్యక్రమంలో పతివాడ రమణ, వరకు మంగరాజు, మీసాల రామానాయుడు, దొంతల చిన్న శ్రీను, దోంతల మాస్టర్ శ్రీను, కంది సత్తిబాబు, కృష్ణవేణి, బంగారు నాయుడు, ఉప్పాడ సీతారాం, గొంతు రమేష్, విజనిగిరి అప్పలనాయుడు, ఉప్పాడ రామిరెడ్డి, సహస్ర పాల్గొన్నారు.

సంస్కరణల ఆద్యుడు ఎన్టీ రామారావు

విశాలాంధ్ర - కోటవురట్ల : మండల వ్యవస్థ ద్వారా రాజకీయ సంస్కరణలకు నాంది పలికిన ఘనుడు ఎన్టీ రామారావుని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. మండలంలో పాములవాక గ్రామంలో పార్టీ సీనియర్ నాయకులు వేచలపు జనార్ధన్ భాస్కరరావు ల సారథ్యంలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహాన్ని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆవిష్కరించారు. సందర్భంగా అనిత మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన ఘనత ఎన్టీరామారావు కే దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవిరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి తప్పుడు పరిపాలన విధానాలకు ఉద్యోగస్తులు నిరుద్యోగులు రైతులు మహిళలు అన్ని వర్గాల వారు విరక్తి చెంది చంద్రబాబు నాయుడు పాలనకు ఎదురు చూస్తున్నారన్నారు. బుద్ధ నాగ జగదీశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సెక్రెటరీ లాలం కాశీనాయుడు, పాయకరావుపేట మండల తెదేపా అధ్యక్షులు చిట్టిబాబు తదితరులున్నారు.

ఏర్నియా వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : కష్టమని వస్తె నేనున్నానని వొట్టి మాటలు చెప్పే నేతలు తప్ప ఆదుకొనే వారు లేని ఈ పరిస్థితుల్లో మేము వున్నామని చెప్పడమేకాకుండ ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయడం లో ముందున్నారు.ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు, అనేక సేవాకార్యక్రమాలు తో ఇప్పటికే ఆయన పేరు పార్లమెంట్ నియోజక వర్గం అంత ఎంవిఆర్ అన్న మాట ప్రభంజనంగా మారింది.అలాంటి వ్యక్తి రాజకీయాల్లోకి వస్తారని తెలిసి ఆనందంతో వున్నారు ఆయన అభిమానులు. అందుకు కారణం ఆయన చేస్తున్న సామాజిక సేవలు అందులో భాగంగా ఆదివారం నక్కపల్లికి చెందిన వ్యక్తి ఎం వి ఆర్ కార్యాలయానికి వచ్చి తాను ఏర్నియతో బాధపడుతున్నాను అని ఆపరేషన్ చేయించుకోవడానికి ఆర్థిక సహాయం చేయమని కోరగా వెంటనే ఎం వి ఆర్ తనయుడు సతీష్ ఆ వ్యక్తికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆ వ్యక్తి తనకు ఆర్థిక సహాయం అందజేసిన సతీష్ కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఎటపాక : ఎటపాక మండలం హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. మండల పరిధిలోని గన్నవరం, గౌరీ దేవీ పేట, తోటపల్లి, నెల్లిపాక, ఎటపాక గ్రామంలో నెలకొని ఉన్న జల హనుమాన్ దేవాలయంలో హను మాన్ ఆలయంలో హనుమాన్ నామ స్మరణతో మారుమోగింది. ఆదివారం హను మాన్ జయంతిని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గౌరీదేవి పేట లో అన్న దాన కార్యక్రమం చేపట్టారు. గన్నవరం లో వెంచేసి యున్న అభయాంజనేయ స్వామి ఆలయంలో ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి ఆశీస్సులతో అందరికి శుభం కలగాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.

పద్మనాభం : మండలంలోని ప్రతి పంచాయతీలో ప్రతి గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనం గా నిర్వహించారు. రేవిడి, పాండ్రంగి కోరాడ, కురపల్లి, పద్మనాభం, రెడ్డిపల్లి, మద్ది, విలాస్కనపాలెం తదితరు గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలను కన్నుల పండుగ నిర్వహించారు. ఉదయం నుంచే ఆంజనేయ స్వామి దేవాలయలకు భక్తులు పోటెత్తారు. ఆంజనేయ స్వామి వారి విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి తమలపాకు దండలు, నిమ్మకాయ దండలు, సింధూరపు పూజలు, పంచామృత అభిషేకాలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మద్ది గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో స్థానిక ఎంపీపీ కే రాంబాబు హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. రెడ్డిపల్లిలో కృష్ణ చంద్ర బాబాజీ మఠం ప్రాంగణంలో హనుమాన్ జయంతి సందర్భంగా భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్ర చదరంగం పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర - నర్సీపట్నం : నర్సీపట్నంలో నిర్వహించిన చదరంగం రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు ఎంపిక య్యారని టోర్నమెంట్ నిర్వహకులు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ క్యాటగిరి ఛాంపియన్ ఎస్ వీర్రాజు, ద్వితీయ స్థానంలో మళ్ళా నూక రాజు తృతీయ స్థానంలో మిద్దె ధనుష్ నాల్గవ స్థానంలో గిరి భీమరిశెట్టి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవగా మహిళా విభాగంలో శ్రావ్య శ్రీ భీమరిశెట్టి మొదటి స్థానం కందుల జయలక్ష్మి ద్వితీయ స్థానం ఈశ్వరి సౌజన్య తృతీయ స్థానం జ్యోతిక సంస్కృత నాలుగో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అని అనకాపల్లి జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అమలకంట శ్రీనివాసరావు గారి పేర్కొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - కే కోటపాడు : జనసేన పార్టీ మాడుగుల నియోజక వర్గంలో బలో పేతం చేయడానికి కార్య కర్తలు కృషి చేయాలని జనసేన నాయకులు కుంచా అంజిబాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రం కే కోటపాడు లో జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఏ నిర్ణయం తీసుకున్న అందుకు కట్టుబడి పని చేస్తామని, వచ్చే ఎన్నికల్లోగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో జనసేన పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తామని అన్నారు. ఈ సమావేశానికి 15 గ్రామాల నుండి కార్యకర్తలు తరలివచ్చారు.

ఘనంగా హనుమజ్జయంతి

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి మెట్ల మార్గం లో ఉన్న ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగింది. మెట్లమార్గంలో ఉన్న ఆలయ పరిసరప్రాంతాలలో పుష్పాలతో భక్తులు అలంకరించారు. స్వామివారికి ఆకుపూజ, సిందూర పూజ ప్రత్యేక అభిషేకములు, హెూమాలు జరిగాయి. అనతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలను పంచిపెట్టారు. తరువాత ఆలయ అర్చక స్వాములు మాట్లడుతూ చైత్రశుద్ధ పౌర్ణమి నాడు జరుపుకునేహనుమజ్జయంతి రోజున జిల్లేడు వత్తులు, నువ్వుల నూనెతో ఆంజనేయస్వామికి దీపమెలిగిస్తే అష్టైశ్వర్యాలీ చేకూరుతాయి అన్నారు. హనుమజ్జయంతి రోజు సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో హనుమాన్‌ను ఆలయంలో దర్శించుకుని, ఎర్రటి ప్రమిదల్లో జిల్లేడు వత్తులు, నువ్వులనూనెతో దీపమెలిగించే వారికి ఆయుర్దాయం, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు చేకూరుతాయని పురోహితులు అన్నారు.

అనుమతులు లేని రొయ్యల చెరువుల వ్యర్థాలతో తాగునీరు కలుషితం

విశాలాంధ్ర - పాయకరావుపేట : మండలంలోని వెంకటనగరం పంచాయతీ పరిధిలో ఉన్న అనుమతులు లేని రొయ్యల చెరువులు విడుదల చేస్తున్న వ్యర్థాలతో వెంకటనగరం, శివారు రాజానగరం గ్రామాల్లో తాగునీరు కలుషితం అవుతుందని గ్రామ సర్పంచ్ వంకా వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా ఎటువంటి అనుమతులు లేకుండా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారని తెలిపారు. క్లీనింగ్‌లో భాగంగా రొయ్యల చెరువుల్లోని వ్యర్థాలను బయటకు విడుదల చేస్తున్నారని, అవి గ్రామానికి సరఫరా అవుతున్న తాగునీటితో కలిసి కలుషితం అవుతున్నాయని తెలిపారు. ఈ వ్యర్థాలు తాగునీటితో కలుషితం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో అనేక పర్యాయాలు ఎటువంటి అనుమతులు లేని రొయ్యల చెరువులపై గ్రామస్తులు ఆందోళన చేపట్టిన అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని సర్పంచ్ వెంకటరమణ ఆరోపించారు. దీంతో రొయ్యల చెరువుల యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యర్థాలను బయటకు విడుదల చేస్తూ తాగునీటితోపాటు భూగర్భ జలాలు కూడా కలుషితం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు చర్యలు తీసుకొని రొయ్యలు చెరువులు సాగు చేయకుండా నిలుపుదల చేయాలని సర్పంచ్ వెంకటరమణ డిమాండ్ చేశారు.

పద్య పఠనంపై విద్యార్థులకు శిక్షణ

విశాలాంధ్ర - నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు శాఖాగ్రంథాలయంలో విద్యార్థులు వేసవి శిబిరం రోజురోజుకూ మరింత ఉత్సాహాన్ని అందిస్తుంది.ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హైస్కూలు తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు పాల్గొని చిన్నారులకు పద్యపఠనంపై ఆసక్తి ని పెంపొందించారు. అనంతరం విద్యార్థులుకు పద్యపఠనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్యులు మాట్లాడుతూ పద్యపఠనం వలన మానసిక వికాసంతో పాటు ఏకాగ్రత లభిస్తుందని, ధారణాశక్తివలన చక్కని ఆరోగ్యం కలుగుతుందన్నారు.పద్యాన్ని దానియొక్క ఛందస్సు ఆధారంగా పఠనం చేయాలని,జ్ఞాన సముపార్జన కు ఇది ఎంతగానో దోహదపడుతుందని ఆచార్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయకమిటీ సభ్యులు మరియు అప్పలరాజు, తంగెళ్ళ రవి ,నూకరాజు తదితరులు పాల్గొన్నారు

వైసీపీ, టీడీపీ నుంచి 250 మంది జనసేనలోకి చేరిక

విశాలాంధ్ర - యలమంచిలి/రాంబిల్లి : మండలంలో లాలంకోడూరు, నేవీ కాలనీల వైసిపి, టీడీపీల నుంచి సుమారు 250 మంది జనసేన తీర్థం పుచ్చుకున్నారు. లాలం కోడూరులో లాలం చందు ఆధ్వర్యంలో కళాసీల అధ్యక్షుడు రుత్తల గణేష్‌తో పాటుగా సుమారు 200 మంది కళాసీలను ఆదివారం అలాగే నేవీ కాలనీ నుంచి 50మంది మండల పార్టీ అధ్యక్షులు పప్పల నూకన్నదొర, లాలం చందుల ఆధ్వర్యంలో జనసేనలోకి చేరారు. వీరందరికి జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, యలమంచిలి నియోజకవర్గ ఇంఛార్జ్ సుందరపు విజయ్ కుమార్ ఇటీవలే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు చేతుల మీదుగా ప్రారంభించిన నూతన కార్యాలయంలో స్వయంగా పార్టీ జెండా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ఇప్పటివరకు అధికారంలో లేకపోయినప్పటికీ రాష్ట్ర ప్రజలకు సేవలను అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో జనపరెడ్డి శ్రీనివాసరావు, అచ్యుతాపురం మండల పార్టీ అధ్యక్షులు బైలపూడి శ్రీరామదాసు, రాంబిల్లి మండల పార్టీ అధ్యక్షులు పప్పల నూకన్న దొర, లాలం చందు, ప్రధాన కార్యదర్శి చోడపల్లి ప్రసాద్, పవన్ విజయ్, పార్టీ నాయకులు జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

సిరిసపల్లిలో విషాదం.. ఐదవ తరగతి విద్యార్థిని మృతి

విశాలాంధ్ర -పెదబయలు : అల్లూరి జిల్లా పెదబయలు మండలం సిరిసపల్లి గ్రామానికి చెందిన అంబిరి లావణ్య శనివారం కేజిహెచ్ లో అనారోగ్యంతో మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. అంబిరి లావణ్య (11) పెదబయలు మండల కేంద్రంలో గల గిరిజన బాలికల ఉన్నత పాఠశాల 1 లో ఐదవ తరగతి చదువుతుంది. గత నెల 29న లావణ్య అనారోగ్యానికి గురి కావడం, వేసవి సెలవులు కావడంతో గ్రామానికి తరలించారు. అయితే గ్రామానికి తరలించిన మూడు రోజులకే తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో విశాఖ కేజీహెచ్ కు తీసుకువెళ్లినప్పటికీ అక్కడ ఉన్న ఎస్టీ సెల్ సిబ్బంది పట్టించుకోకపోవడం, వైద్యులు మెరుగైన వైద్యం సేవలు అందించకపోవడంతోనే తమ కూతురు ప్రాణాలు విడిచిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ఎప్పటినుంచి అనారోగ్యంతో ఉందో తమకు తెలుపలేదని ఈ విషయమై వివరణ కోరగా పొంతన లేని సమాధానాలు చెప్తున్నారని అన్నారు. విషయం తెలుసుకున్న గిరిజన సంఘం, సిపిఎం నాయకులు గ్రామాన్ని సందర్శించి విద్యార్థిని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.గిరిజన ఆశ్రమ పాఠశాలలో తక్షణమే హెల్త్ సూపర్వైజర్లు లను నియమించాలని గిరిజన సంఘం, సిపిఎం నాయకులు పృథ్వీరాజ్, సన్నీ బాబు డిమాండ్ చేశారు.

పేదల పెన్నిధి 'యతిరాజుల'

విశాలాంధ్ర - పెందుర్తి : వైఎస్సార్ కాంగ్రెస్ నగర అధికార ప్రతినిధి, నాయుడుతోట హెల్పింగ్ హేండ్స్ వ్యవస్థాపకుడు యతిరాజుల నాగేశ్వరరావు నిస్వార్థపర రాజకీయవేత్త, పేదల పెన్నిధి అని గోపాలపట్నం ట్రాఫిక్ సిఐ కే.అశోక్ కుమార్ కొనియాడారు. జీవీఎంసీ 94వ వార్డు అప్పలనరసింహ నగర్ వద్ద, కాలనీ అభివృద్ధి కమిటీ నిర్మించిన ముఖద్వారాన్ని సిఐ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల రాజకీయాల్లో తన సంపాదనలో 90 శాతం సమాజానికి ఖర్చుపెట్టే ఏకైక నాయకుడు యతిరాజుల నాగేశ్వరరావు మాత్రమేనని స్పష్టం చేసారు. నిరంతరం సమాజం, ప్రజల కోసమే ఆలోచిస్తారని చెప్పారు. కాగా అప్పలనరసింహనగర్ కాలనీలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని అభివృద్ధి కమిటీ సభ్యులు కోరగా, త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మరో ముఖ్యఅతిథి బంటాకాలనీ పిహెచ్ సి వైద్యాధికారి విష్ణుసాయి మాట్లాడుతూ నాగేశ్వరరావు సమాజానికి అందిస్తున్న సేవలు రోజు, రోజుకు పెరుగుతున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో హెల్పింగ్ హేండ్స్ ప్రధాన కార్యదర్శి కంచిపాటి జగదీశ్, కమిటీ సభ్యులు వంకర చినఅప్పారావు, శ్రీనివాసరావు, బల్లశ్రీనివాసరావు, గంట్ల శ్రీనివాస్, తవిటినాయుడు కూన రామరాజు, గోవిందరావు,ఆవాల గొల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - రంపచోడవరం : రామ కృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమండ్రీ వారి అధ్వర్యంలో ఆదివారం రంపచోడవరం శివారు సిరిగిందలపాడులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిభిరం లో సుమారు 60మంది వివిధ వైద్య సేవలు పొందినట్టు రామ కృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిభిరం లో రామకృష్ణా మఠం ఆఫీస్ ఇంఛార్జి స్వామీ వేద విద్యానందజి మహరాజ్, స్వామి సేవ్యనందాజీ మహరాజ్, మెడికల్ క్యాంపులో పాల్గొని మెడికల్ క్యాంపు సేవలను పరిశీలించారు. డా.జి.భాస్కర్ డా.తలారి వెంకట సుబ్బారావు డా. ఎస్. సంపత్ కుమార్ పాల్గొని సుమారు 200 మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలియ చేసినారు, ఈ వైద్య శిబిరంలో క్యాంప్ కో- ఆర్డినేటర్ కానుమొను శ్రీనివాస్, వలంటీర్ మనే వీర్రాజు, మరియు సిబ్బంది పాల్గొన్నారు, రోగులకు, సహాయకులు కు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు.

పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - చింతూరు : ప్రతి ఒక్కరూ పర్యావరణహిత, ప్లాస్టిక్ రహిత, జీవనశైలిని (మిషన్ లైఫ్) అలవర్చుకోవాలని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పేర్కొన్నారు. ఇంఛార్జ్ డీఎఫ్వో సౌజన్య ఆదేశాల మేరకు లక్కవరం అటవీ క్షేత్రాధికారి కొండలరావు పర్యవేక్షణలో లక్కవరం, సుక్కు మామిడి, దబ్బగూడెం సెక్షన్స్ పరిధిలోని సుక్కుమామిడి, లక్కవరం, సిరసనపల్లి, గొడ్లగూడెం, గోపాలపురం, దబ్బగూడెం గ్రామాల్లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మిషన్ లైఫ్పై ఫ్లకార్డులు, బ్యానర్లు పట్టుకొని గ్రామాల్లో, తునికాకు కల్లాల వద్ద ప్లాస్టిక్ వినియోగంపై కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డీఆర్వో మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత జీవనశైలిని అలవర్చుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా జీవించడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించ వచ్చన్నారు. ప్లాస్టిక్ సంచులని వినియోగించకుండా క్లాత్ సంచులను వాడాలని, మట్టిలో కలిసి పోయే పేపర్ వినియోగించాలని, చెట్లను, అడవులను పరిరక్షించుకోవాలని, మొక్కలను విరివిగా నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు బి.సరిత, రాజమ్మ, బసవయ్య, రామదాసు, వెంకట్, సీతయ్య, బేస్ క్యాంపు వాచర్స్ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు ఐటీడీఏలో ట్రైబల్ లీగల్ సెల్ ఏర్పాటు చెయ్యాలి

విశాలాంధ్ర - చింతూరు : చింతూరు ఐటీడీఏలో ట్రైబల్ లీగల్ సెల్ ఏర్పాటు చేయాలని చింతూరు మండల న్యాయవాది మడివి రవితేజ ఏపీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కుంభ రవిబాబును కోరారు. అరకు వాలీలో కాఫీ హౌస్‌లో ఆదివారం కలిసి ఈ విషయాన్ని విన్నవించారు. చింతూరు కేంద్రంగా ఉన్న ఐటీడీఏ లో ట్రైబల్ లీగల్ సెల్ ఏర్పాటు చెయ్యడం వలన ఆ ప్రాంత ఆదివాసీలకు ఉచితంగా న్యాయ సహాయం అందించడానికి అవకాశం ఉంటుందని కుంభ రవిబాబుకు వివరించడం జరిగింది. ఆయన సానుకూలంగా స్పందిస్తూ ట్రైబల్ లీగల్ సెల్ ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు.

దుర్గాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఘనంగా హనుమాన్ జయంతి

విశాలాంధ్ర - కొమ్మాది : చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో క్షేత్ర పాలకుడిగా ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి వారికి పంచామృత సుగంధ జలం, సింధూర జలం, మొదలగు సామగ్రితో అభిషేకం జరిపించడం జరిగింది, అనంతరం చందనంతో ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక అలంకరణ ఆలయ అర్చకులు పట్నాల హరి ప్రసాద్ శర్మ, హరి స్వామి, మూర్తి శర్మ, హరి చరణ్ చేయడం జరిగింది, అనంతరం సింధూరార్చన, నాగవల్లీ ధళార్చన నీరాజన మంత్ర పుష్పం మొదలగు పూజా కార్యక్రమాలు జరిపించిరి, చంద్రంపాలెం వాస్తవ్యులు శ్రీ పిళ్లా తమ్మునాయుడు దంపతులు, మరియు శ్రీ శ్రీకాంత్ వర్మ, శ్రీమతి కళ్యాణి దంపతులు ఆర్థిక సహాయంతో ఆలయంలో తీపి బూందీ ప్రసాదము ఏర్పాటు చేసి భక్తులకు పంపిణీ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, ఉపాధ్యక్షులు, యస్.యస్.మూర్తి, సెక్రటరీ నాగోతి తాతారావు, ఉప కోశాధికారి దుక్కవరం, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీస రమణ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ జాతర సందర్భంగా కార్నివాల్

విశాలాంధ్ర - పాడేరు : మోదకొండమ్మ అమ్మవారి జాతర మహెూత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఐటీడీఏ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్నివాల్‌ను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ప్రారంభించారు. కార్నివాల్ ఐటిడిఎ నుండి అమ్మవారి దేవాలయం వరకు సాగింది. ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ, ఎపివోలు విఎస్. ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు డిడి కొండల రావు తదితరులు పాల్గొన్నారు. ఐటిడిఏ కాఫీ, ఉద్యానవన విభాగం, స్పైసెస్ బోర్డ్, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయం, పోలీస్ శాఖ, సమాచార శాఖ, వైయస్సార్ క్రాంతి పదం, ఐసిడిఎస్, గిరిజన సహకార సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖలు, ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో, వి.అభిషేక్. అడిషనల్ ఎస్పీ ధీరజ్ తదితరులు స్టాల్స్‌ను ప్రారంభించారు.

ఆహారభద్రతా అధికారులు..... తనిఖీలెక్కడ ?

విశాలాంధ్ర - గోపాలపట్నం : ప్రతి నిత్యం ప్రజలు తమ ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించే నిత్యవసర సరుకుల్లో కల్తీ జరుగుతున్న వాటిని అదుపు చేయడానికి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాకపోవడం ఆశ్యరకరంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిదంగా తిను బండారాల తయారి దుకాణాలు, హెూటల్లు, స్వీట్ తయారి దుకాణాలు మొదలగు వాటిపై ఆహారభద్రతా అధికారులు తనిఖీలు చేసినట్లు కనిపించటం లేదు అని ప్రజలు అంటున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు ప్రకారం ఎఫ్ఏసేస్ఏఐ దృవపత్రాలు సంబందిత దుకాణాల్లో లేవు. వీటిపై సంబందిత అధికారులు ఎందుకు దృష్టి సారించటం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నగరాలు, గ్రామాలలో వ్యాపారస్థులు నిత్యవసర సరుకుల్లో కల్తీ, నాసిరకం రాజ్యమేలుతుందని వినియోదారులు అంటున్నారు. ప్రజలు నిత్యం ఆహార పదార్థాలకు ఉపయోగించే పప్పు, చింతపండు, బియ్యం, పసుపు, కారంపొడి, వంటనూనెలు, కొబ్బరినునే, పంచధార వంటి సరుకులతో పాటు నిత్యవసర సరుకుల్లో నాణ్యతలోపం జరుగుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్, సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించిన దాకలాలు లేవు. దుకాణదారులపై కేసులు, చర్యలు తీసుకున్న సందర్భలు ఏమాత్రం కనిపించడం లేదు. ఆహార పదార్థాల్లో కల్తీచేసి వ్యాపారస్థులు తెలివిగా వినియోదారులను మోసం చేస్తున్నారని సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు అడ్డు కోక పోవడానికే కారణం వ్యాపారస్థులు చేసే ప్రలోభలు రాజకీయ సంబందాలేనాని అందరికి తెలిసిన బహిరంగ రహస్యం. వ్యాపారస్తులు తమ వ్యాపా రాన్ని మూడు పువ్వులు ఆరు కాయాలుగా కొనసాగించు కుంటూ వేలది, లక్షలాది రూపాయాలు సంపాదించు కుటుంన్నారని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతల్లో విక్రయించే నిత్యవసర సరుకుల్లో అయితే ఇంక చెప్పనవసరంలేదు. ఇటువంటి నాసిరకం వ్యాపారాలుచేస్తూన్న వ్యాపారులు ప్రజల్ని అనారోగ్యలపాలు చేస్తున్న సంబంధిత అధికారులు నిరోదించే ప్రయత్నం ఏ మాత్రం చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యాపారస్థులు ఇచ్చే ఆమ్యామ్య పుచ్చుకుంటూ అనలు విషయన్ని తుంగలో తొక్కుతున్నారని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రంగం చర్యలు తీసుకోని నాసిరకం వస్తువులతో చేస్తున్న వ్యాపారాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



విశాలాంధ్ర - పరవాడ: జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్నవాన్నపాలెంలో హనుమాన్ జయంత్రి వేడుకలలు ఆదివారం ఘనంగా జరిగాయి. తెల్ల వారు జాము నుంచే అభయాంజనేయ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, గాజువాక వైసీపీ ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనలో సుమారు 3000 మంది పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. గొన్న కళాశాల సెక్రటరీ గొన్న హేమ్‌చంద్‌నాయుడు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: నెల్లిముక్కు ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గొందేసి ఎల్లయ్య రెడ్డి ఆధ్వర్యంలో పండితుల వేద మంత్రాల మధ్య కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, పులి సురేశ్ రెడ్డి (బాబీ), గొందేశి అప్పల రెడ్డి కుటుంబ సభ్యులు, పిట్ట గురునాథ్ రెడ్డి, దేవాడ దేవి, బస రమణా రెడ్డి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం దూసరిపాము పంచాయితీ ఎర్రంపాడు గ్రామంలో హనుమాన్ జయంతిని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాగాలు నిర్వహించారు. భారీ అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు చింత నానిబాబు, చింతల రాంబాబు, జీరెడ్డి రామకృష్ణ, నరసింహమూర్తి, కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించారు.

హుకుంపేట: మండలంలోని సూకురు పంచాయితీ బిరిసింగీ లో హనుమాన్ జయంతి వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. అఖిల భారత గిరిజన ఉద్యోగస్తుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి సింహాచలం తమ కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటి వారి ఆద్వర్యంలో అన్న సంతర్ప కార్యక్రమం నిర్వహించారు.



మల్కాపురం : హనుమాన్ జయంతి సందర్భంగా గాజువాక డిపో జింక్ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పివి గణబాబు ముఖ్య అధికారి పాల్గొని సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



చోడవరం: పలు గ్రామాల్లో ఆదివారం పవన సుత హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుండి స్వామికి పంచామృత అభిషేకం, సింధూరం అభిషేకాలు జరిపించారు. భక్తులచే సామూహికంగా లక్ష తమలపాకులు, గంగా సింధూరం తో పురుష సూక్త, విధానంలో సహస్ర నామ అభిషేకములు నిర్వహించారు.

యలమంచిలి/యలమంచిలి రూరల్: హనుమాన్ జయంతి వేడుకలు యలమంచిలి పట్టణం ఆర్టీసీ కాంప్లెక్స్, మెయిన రోడ్,రామ్ నగర్‌లలో ఆదివారం నాడు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హను మాన్ దేవాలయం జయంతి వేడు కల కోసం ముస్తాబు చేశారు. తెల్లవారుజాము నుండే భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. పలు దేవాలయాలలలో అన్న సంతర్పణను ఏర్పాటు చేశారు. రామారాయుడుపాలెం కౌన్సిలర్ మరిణీశ్వరరావు, పిట్టా సత్తిబాబు, వైసీపీ నాయకులు రామ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఐకమత్యంతో ఉద్యమించాలి

విశాలాంధ్ర - చింతపల్లి: గిరిజన సంఘాలు ఐక్యమత్యంతో ఉద్యమిస్తేనే చట్టాలు, హక్కులను సాధించు కోగలమని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోచలి రామకృష్ణ అన్నారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే సత్యనారాయణ అధ్యక్షతన విజయవాడలో నిర్వహించిన ప్లీనరీలో ఆయన మాట్లాడుతూ బోయ వాల్మీకులు, బెంతి ఒరియాలను గిరిజన తెగ జాబితాలో చేర్చడం వలన ఏజెన్సీ ప్రాం తంలో నిజమైన గిరిజనులు 100% రిజర్వేషన్ కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. అదేవిధంగా చింతపల్లి, కొయ్యూరు సరిహద్దు ప్రాంతమైన సమగిరి, ఎర్రవరం ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం వలన 32 గ్రామాల గిరిజనులు నిర్వాసితులయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో గిరిజన ఎమ్మెల్యేలు వత్తాసు పలికి ఆ తీర్మానాలకు అనుకూలంగా సంతకాలు చేశారని ఆయన గుర్తు చేశారు. అటువంటి ఎమ్మెల్యేలను గిరిజనులకు రాబోవు ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆంధ్ర పదేశ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర - చీడికాడ: గ్రంథాల యంలో గ్రంధాలయా ధికారిణి ఏం యస్ యల్ జోగేశ్వరి ఆధ్వర్యంలో వేసవివిజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సుమారు 30 మంది విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచి స్టోరీలను బోధించి చదివించామన్నారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన



విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: స్థానిక 86వ వార్డు కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద 40 లక్షల రూపాయలతో నిర్మించిన ఆధునిక బస్ షెల్టర్ నిర్మాణానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు వెలుగుల పరుశురాముడు (మెడికల్ బాబు), కన్వీనర్ వాడపల్లి రామచంద్ర రాజు, చిట్టి దేవుడు, మాటూరి శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ పట్నాయక్, సచివాలయ కన్వీనర్ బాలకృష్ణ, పత్తిపాటి శ్రీను, జీవన్, ఆనంద్, హరీష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ ఏబీవీపీ విద్యార్థి నాయకుడు



విశాలాంధ్ర - రాంబిల్లి: మండలంలో వాడ నరసాపురం గ్రామానికి చెందిన మాజీ ఏబీవీపీ విద్యార్థి నాయకుడు మైలపల్లి కోదండరావు ప్రధాని మోడి నాయకత్వం, కేంద్ర ప్రభుత్వం పథకాలు నచ్చి భారతీయ జనతా పార్టీలో యల మంచిలి బిజెపి నియోజవర్గ కన్వీనర్ రాజానా సన్యాసి నాయుదు ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి



విశాలాంధ్ర - మల్కాపురం: రాజ్యాంగ నిర్మాత దళితుల ఆశాజ్యోతి అంబేద్కర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకువెళ్లాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మల్కా పురం పారిశ్రామిక ప్రాంతంలో ప్రకాష్ నగరంలో షెడ్యూల్ కులాల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఉత్సవాలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ భవనం సొసైటీ ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు మరువలేనిదని, ఆయన కులం కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహానుభావుడన్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుడాల రాంబాబు, సత్యనారాయణ , అంబేద్కర్ భవనం సొసైటీ అధ్యక్షులు బొడ్డు కళ్యాణ్ రావు, 61వ కార్పొరేటర్ పద్మ , 62వ వార్డు నేతలు లక్ష్మణరావు, కాకర రమణ, షోలే తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ

విశాలాంధ్ర - పద్మనాభం: ప్రజలను నమ్మించి మోసం చేసిన భాజాప నరేంద్ర మోడీపై చర్య తీసుకోవాలని పద్మనాభం పోలీస్ స్టేషన్లో ఎంపీపీ రాంబాబు ఆదివారం ఫిర్యాదు చేశారు. 10 సంవత్సరాల కిందట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలుగా విడిపోవడానికి కాంగ్రెస్‌తో కుమ్మక్కై విడగొట్టిందన్నారు. భీమిలి నియోజకవర్గం లో ఆంధ్ర చైతన్య పార్టీ అని పేరు పెట్టిన వ్యక్తి కె రామనాయుడు గతంలో ప్రజలకు మంచి చేస్తానని నమ్మబలికి మండలంలోని పొట్నూరు పంచాయతీ వద్ద కాజు వే వంతెన నిర్మిస్తానని మోసం చేశారన్నారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిన కే రామ నాయుడుపై చర్యలు తీసుకోవాలని స్థానిక సీఐకి ఎంపీపీ రాంబాబు, జడ్పిటిసి గిరిబాబ, ఈశ్వరరావు ఫిర్యాదు చేశారు.

మోదకొండ అమ్మవారి జాతర ప్రారంభం



విశాలాంధ్ర బ్యూరో - అల్లూరి జిల్లా: మన్యం ప్రజల ఆరాధ్య దైవం శ్రీ మోదకొండమ్మ వారి జాతర మహొత్సవాలు పాడేరులో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మ వారి ఉత్సవాలను పలువురు ప్రజాప్రతినిధులు నాయకులు తోపాటు జిల్లా కలెక్టర్ ఐటిడిఎ పిఓ, ఇతర జిల్లా యంత్రాంగం అంతా పాల్గొని ప్రారంభించారు. నాయకులు అధికారులు స్వయంగా అమ్మవారి పాద గటాలను మోసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ, అరకు పాడేరు ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీనివాస్ గౌడ్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కోయంబత్తూరులో ఎల్ గీ సాయిరీర్ తయారీ కేంద్రం

విశాలాంధ్ర -విశాఖ సిటీ: ఎల్ గీ ఎక్విప్‌మెంట్స్ లిమిటెడ్, జర్మనీకి చెందిన సాయుర్ కంప్రెషర్స్ గ్రూప్ మధ్య జాయింట్ వెంచర్ అయిన ఎల్ గీ సాయూర్ కంప్రెషర్స్ లిమిటెడ్ తమిళనాడులోని కోయంబత్తూరులోని కల్లప్పలయంలో కొత్త తయారీ కేంద్రాన్ని ప్రారంభించడం ద్వారా కార్యకలాపాలను విస్త రించింది. సుమారు రూ.400 మిలియన్ల పెట్టుబడితో, 50,000 చ. అడుగుల కేంద్రం భారతదేశంలో పారి శ్రామిక, వాణిజ్య షిప్పింగ్, నావల్, ఆఫ్‌షోర్ మార్కెట్ల కోసం అత్యాధునిక హై-ప్రెజర్ కంప్రెషర్‌లు, ప్రెషర్ రెడ్యూసింగ్ స్టేషన్‌లు, పోర్టబుల్ బ్రీతింగ్ ఎయిర్ కంప్రెషర్‌ల తయారీని ప్రారంభిస్తుందనీ ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. ప్రారంభోత్సవంలో ఎల్ గీ ఎక్విప్‌మెంట్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జైరామ్ వరదరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కనిపించే ప్రత్యక్ష దైవం అమ్మ

విశాలాంధ్ర - చింతపల్లి: నవ మాసాలు మోసి " కని " పెంచే, కనిపించే ప్రత్యక్ష దైవం " అమ్మ" అని వైకాపా నాయకుడు జల్లి సుధాకర్ అన్నారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయన తన తల్లికి శుభాకాంక్షలు తెలపడమేగాక ఆమె ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ మాసాలు మోసి బిడ్డలకు జన్మనివ్వడమే గాక ఆ బిడ్డలను కంటికి రెప్పలా కాపాడే మాతృ మూర్తులకు ప్రతి బిడ్డ వందనాలు తెలపాలన్నారు.

వైసీపీ నాయకుల అక్రమాలు బయటపడుతున్నాయి

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తిలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు వైసీపీ నాయుకులు సాగించిన భూఅక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పి.వి.ఎన్.మాధవ్ డిమాండ్ చేసారు. పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జ్ గొర్లె రామునాయుడు అద్వర్యంలో పెందుర్తిలో ప్రజా చార్జ్ షీట్ కార్యక్రమం నిర్వహించి, ప్రజలనుండి ఫిర్యాదులు స్వీకరించారు.

మాధవ్ మాట్లాడుతూ పెందుర్తిలో వైసిపి నాయుకులు సాగించిన భూఅక్రమాలు అన్నీ ఇన్నీ కావని విమర్శించారు. ప్రభుత్వ భూములతో పాటు దేవుడి భూములను కూడా రికార్డులు మార్చి సొంతం చేసుకున్నారని విమర్శించారు. రామునాయుడు మాట్లాడుతూ వైసీపీ అదికారంలోకి వచ్చిన తర్వాత పెందుర్తిలో భూమాఫియా పెరిగిపోయిందని మండిపడ్డారు.

16న భవన నిర్మాణ కార్మికుల చలో కలెక్టరేట్

విశాలాంధ్ర - విశాఖ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పరిరక్షించాలని, రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన బోర్డును పునరుద్ధరించాలని, దాని ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) విశాఖ జిల్లా అధ్యక్షులు కోటా సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి ఏ.మదన్ మోహన్ డిమాండ్ చేశారు. మే 16న ఏపీ బిల్డింగ్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 'చలో విశాఖ కలెక్టరాఫీస్' కార్యక్రమంలో తాపీ మేస్త్రీ, పరంజి, సెంట్రింగ్, రాడ్ బెండర్ పెయింటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, మార్బుల్, టైల్స్ తదితర కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమ బోర్డులో రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల మంది కార్మికులు నమోదు చేయించుకుని సంక్షేమ కార్డులు ద్వారా లబ్ది పొంది సంక్షేమ ఫలాలు అనుభవిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచీ పని చేసే ప్రదేశాల్లో ప్రమాదాల వలన మరణించినా, సహజ మరణం చెందినా, ప్రమాదం వలన శాశ్వత అంగవైకల్యం లేదా పాక్షికంగా అంగవైకల్యం కలిగినా కార్మికుల కుటుంబాలకు ఇచ్చే పారితోషికంతో పాటు భార్య లేదా కుమార్తెలకు సంబంధించిన రెండు కాన్పులకు ఇచ్చే పారితోషికం, కార్మికుల పిల్లలకు ఇచ్చే స్కాలర్ షిప్ నిలిపివేసారన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రభుత్వ పథకాలకు బోర్డు నుండి అక్రమంగా తరలించిన నిధులను వెంటనే కార్మిక సంక్షేమ బోర్డు కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ హాజరవుతారని తెలిపారు.

అత్యుత్తమ ర్యాంకింగ్ దిశగా ఏయూ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం సర్వతో ముఖాభివృద్ధికి అధికారులు తీసుకుంటున్న పలు చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. గడచిన నాలుగు సంవత్సరాల కాలంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం అద్వితీయ ప్రగతి సాధిస్తోంది. ఆచార్య పి.వి.జి.టి ప్రసాద రెడ్డి ముందుచూపు, ఆయన సారధ్యంలో వర్సిటీ అధికారులు చేస్తున్న కృషి ఫలితంగా వర్సిటీ ర్యాంకింగ్ అవకాశాలు మెరుగు పడుతున్నాయి. ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యా పరి శోధన తదితర అంశాలలో అఖిల భారత స్థాయిలో తన సత్తా చాటుతోంది. బోధన, పరిశోధనలకు ప్రాధాన్యత కల్పిస్తూ స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర రంగాలలో కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు ధీటుగా నిలుస్తోంది. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ విశ్వవిద్యాల యంలోను లేని విధంగా చెయిర్ ప్రొఫెసర్లను సైతం ఏయూ కలిగి ఉంది. ఇటీవల జరిగిన ప్లేస్మెంట్‌లలో అత్యధికంగా రూ.84.5 లక్షల వేతనాన్ని ఏయూ విద్యార్థి సాధించింది. కేవలం ప్లేస్మెంట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు పరిమితం చేయకుండా, సైన్స్, ఆర్ట్స్, ఫార్మశీ, న్యాయ కోర్సుల్లో కూడా వేల సంఖ్యలో అందించే విధంగా ప్రత్యేక ప్రణాళికతో ఏయూ పనిచేస్తోంది. వీటితో జాతీయ స్థాయిలో ఏయూ ప్రాభవం పెరుగుతోంది. భవిష్యత్తులో ఏయూ మరిన్ని అత్యుత్తమ ర్యాంకులను కైవసం చేసుకునే అవకాశం ఉంది.

గిరిజనేతరులను ఎస్టీలో కలపొద్దు

విశాలాంధ్ర - ఎటపాక: గిరిజనేతర కులాలను ఎస్టీ జాబితాలో కలిపేందుకు అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ఆదివాసి జేఏసి డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ మండల అధ్యక్షుల కాక రాజు అధ్యక్షతన పునర్నిర్మాన సమావేశం ఎటపాక మండల, కృష్ణవరం పంచాయితీ, కృష్ణవరం గ్రామంలో నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులు ఏటిఏ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ బోయ, వాల్మీకి, నకిలీ బెంతు ఒరియా కులాలను కలపడం అంటే ఎస్టీ ఆదివాసీ సమాజంపై పిడుగు పాటు వంటిదేనన్నారు. వెంటనే అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల జేఏసి చైర్మెన్‌గా కుంజా శ్రీను, వైస్ చైర్మెన్లుగా వాసం రాము, కౌలూరి కామేశ్వరరావు, పొడియం హరిబాబు, పాయం ప్రసాద్, గొంది నరేంద్ర, ఉయిక రాంబాబు, దానె ప్రసాద్, కంగాల దేవిడ్ రాజు, జలకం ముదరాజు, తెల్లం నాగరాజు, గుండి చిన్నారావు సిహెచ్. రామారావు, ఇర్పా నాగేశ్వరరావు, కోశాధికారులుగా నూప అనిల్, కణితి రామకృష్ణ, అధికార ప్రతినిధులుగా సరియం రాజులు, తాటి సీతారాములు, ప్రచార కార్యదర్శిగా సున్నం శ్రీనులు ఎన్నికయ్యారు. సమన్వయకర్త మడివి నెహ్రూ, సీనియర్ ఉపాధ్యాయులు సోడి నారాయణ, డివిజన్ మహిళా వైస్ ఛైర్మెన్ మిడియం రమణమ్మ, మరో వైస్ ఛైర్మెన్ పోలమంచి తమ్మయ్య పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సత్య సాయి శోభా యాత్ర

విశాలాంధ్ర - కె.కోటపాడు: శ్రీ సత్యసాయి బాబా శత జన్మదిన వేడుకల్లో భాగంగా మండలంలోని కింతాడ శివారు కూండ్రపువానిపాలెం శ్రీ రామ సత్యసాయి మందిరంలో ఆదివారం నమామి సాయి శత రుద్రీయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. ఉదయం శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో శ్రీ రావాలమ్మా బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ యజమాని కన్నూరు సూర్యనారాయణ, రామమ్మ దంపతులు బాబా వారి చిత్రపటాన్ని జోగన్నపాలెం కె.వి. పాలెం గ్రామాల్లో సాయి భక్తుల బృందం నడుమ ఊరేగించారు. అనంతరం మందిరం ప్రాంగణంలో గోపూజ చేశారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో ప్రశాంతి నిలయ ప్రతాకవిష్కరణ గావించారు. ఉదయం నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏకధాటిగా ఏడు గంటల పాటు శ్రీ సత్య సాయి సంస్థల రాష్ట్ర వేదఅధ్యయన విభాగం ప్రతినిధి డాక్టరు కొఠారు సాయిశ్రీ హరిప్రసాదశర్మ ఆధ్వర్యంలోశ్రీ సాయిలింగేశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు. ఈ రుద్రాభిషేకంలో శ్రీ సత్య సాయి సంస్థల జిల్లా అధ్యక్షులు వైశ్యరాజు కృష్ణరాజు, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త కశిరెడ్డి అప్పలనాయుడు, భజన మండళ్ల కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల ఇన్చార్జి కన్నూరు అప్పలనాయుడు, గంధం సూర్యం, జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త శక్తిమూర్తి,రమామణి ఆధ్యాత్మిక విభాగం సమన్వయకర్త కామరాజు, సాయి లక్ష్మి,ఐటి విభాగం సమన్వయకర్త అశోక వర్మ, యువజన విభాగం సమన్వయకర్త తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలోని దేవవరం శివారు ఒడ్డిమెట్ట జాతీయ రహదారిపై శనివారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ములగపూడికి చెందిన వై.నారాయణమ్మ తన మన వరాలు ఏ.నందును తీసుకొని ఒడ్డుమెట్లో ఉన్న వివాహానికి హాజరవడానికి ఆటోలో వచ్చారు. ఒడ్డిమెట్ట పెట్రోల్ బంక్ రోడ్డు ప్రక్కన దిగి అవతలి వైపు వెళుండగా తుని నుంచి నక్కపల్లి వైపు వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నారాయణమ్మ అక్కడికక్కడే మృతి చెందగా నందు తలకు బలమైన గాయమైంది. 108 సిబ్బంది శ్రీనివాస్, నాగార్జునలు చేరుకుని కాకినాడ జిల్లా తుని ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. పోలీసు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

పది ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి అభినందన



విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంస అందుకున్న శ్రీనాదు వర్షిణిని 65వ వార్డ్ కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు ఘనంగా సన్మానించారు. విద్యార్థినికి మిఠాయి తినిపించి అభినందనలు తెలియజేశారు. వార్డులోని సంజీవగిరి కాలనీ సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్న శ్రీనాధు శ్రీనివాస్ కుమార్తె వర్షిని గాజువాక హైస్కూల్‌లో చదువుతూ పది పరీక్షల్లో 600 మార్కులకు గాను 578 మార్కులు సాధించి సత్తా చాటింది.

కార్యక్రమంలో వార్డు కమిటీ ప్రధాన కార్యదర్శి పెద్దింటి మంగునాయుడు,జానా సతీశ్, పెంద్ర రాజు, కేకే మాస్టర్ పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా భారతి ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - చోడవరం: స్థానిక గణేష్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రేమ సమాజం ప్రసాద్ రాజు గారి అధ్యక్షతన క్రీడా భారతి ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో అంతరించిపోతున్న క్రీడలను బాలబాలికలకు అందించి, వారికి ఆరోగ్యం, ఆహ్లాదకరంగా జీవించే విదానమే క్రీడాభారతి ధ్యేయమని ప్రేమ సమాజం ప్రసాద్ రాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం క్రీడా భారత అధ్యక్షుడు పుల్లేటి గణేష్ మరియు డిఫెన్స్ అకాడమీ అసిస్టెంట్ కోచ్ మారుతి ,నాగమణి, సన్యాసినాయుడు, హేమ ,లక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులుగా దాడి

విశాలాంధ్ర - కే కోటపాడు: ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షులుగా చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకు నాయుదును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వై వి బి. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లిలో జరిగిన ఉమ్మడి జిల్లాల సర్పంచుల సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు దాడి ఎరుకు నాయుడు మాట్లాడుతూ తనకి ఈ అధ్యక్ష పదవి కట్టబెట్టిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వై వి బి. రాజేంద్రప్రసాద్ కు రాష్ట్ర సర్పంచులు సంఘం అధ్యక్షులు గా వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, ఉమ్మడి జిల్లాల సర్పంచుల సంఘం అధ్యక్షులుగా చింతకాయల సుజాత ముత్యాలరావు, పంచాయతీరాజ్ చాంబర్ కార్యదర్శిగా బుర్ర నాగరాజు, పంచాయతీరాజ్ చాంబర్ ప్రధాన కార్యదర్శిగా బి ప్రతాపరెడ్డి లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన సంఘం మండల నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - జి.మాడుగుల: గెమ్మెలి పంచాయతీ గొడుగు రాయి గ్రామంలో సీనియర్ నాయకుడు వి.పిన్నంనాయుడు గిరిజన సంఘం జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం గిరిజన సంఘం 8వ మండల మహాసభ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పి.లక్కు పర్యవేక్షణలో ఎస్. ధర్మన్నపడాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. మండల అధ్యక్షులు వనుగు సన్యాసి దొర, మండల కార్యదర్శి కొటారి కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా పాంగి వెంకటరావు, వంజారి పిన్నంనాయుడు, అరగడ శ్రీ లత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ధ్వజస్తంభ సంప్రోక్షణ



విశాలాంధ్ర - పద్మనాభం: పాండ్రంగి గ్రామంలో 200 సం,, పైగా చరిత్ర కలిగిన శ్రీ వేణు గోపాలస్వామి వారి దేవాస్థానం నందు ధ్వజస్థంబ సంప్రోక్షణ కార్యక్రమం అర్చకులు శ్రీరామఆచార్యులు ఈవో నానాజీ, దేవాలయం చైర్మన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఉపాధ్యాయ అప్పలనర్సయ్య (కృష్ణ బాబు),డి. వి. వి. యన్. రాజు (శ్రీనుబాబు) మరియు కొందరు సహాయంతో ఆలయ పెయింటింగ్ లు మరియు ధ్వజస్థంభ ఇత్తడి రేకుతో అలంకరించి అంగరంగ వైభవంగా ఆలయంను తయారుచేశారు. కార్యక్రమంలో అప్పలనరసయ్య (కృష్ణబాబు), డి. వి. వి. యన్. రాజు (శ్రీనిబాబు), బిజెపి ప్రధాన కార్యదర్శి మహంతి అప్పల రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నబ్బాయి మరణం సీపీఐకి తీరని లోటు

విశాలాంధ్ర - జీకే వీధి: సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు సుంకరి చిన్నబ్బాయి మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జీకే వీధి మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మన్య ప్రాంతంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించిన చిన్నబ్బాయి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం హఠాన్ మరణం చెందడం విచారకరమన్నారు.

ఉచిత వైద్య శిబిరం



విశాలాంధ్ర - యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో కొత్తపాలెం గ్రామంలో ఆదివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆరోగ్య రక్ష వైద్యుల ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో జనరల్ మెడికల్ క్యాంపు నిర్వహించి, 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రీనివాస శాస్త్రి డాక్టర్ ప్రభాకర్ డాక్టర్ లక్ష్మి ఆయుర్వేదిక్, డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ పిఎస్ఆర్ మూర్తి, డాక్టర్ జగన్నాథరావు వైద్య సేవలు అందించగా గ్రామస్తులు దాడి లక్ష్మణరావు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బాలికల అభ్యున్నతికి ఎన్టీపీసీ కృషి

విశాలాంధ్ర - పరవాడ: బాలికల అభ్యున్నతికి ఎన్టీపీసీ ప్రత్యేక కృషి చేస్తోందని ఆ సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) వి.రమేష్‌బాబు పేర్కొన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్‌లో గల శకుంతల ఆడిటోరియంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బాలిక సాధికారిత మిషన్-2023 శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ బాలికల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి మండలంలో ఈ ఏడాది 6వ తరగతి ప్రవేశం పొందే ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 120 మంది బాలికలను ఎంపిక చేసి క్రీడలు, చిత్రలేఖనం, క్రాఫ్ట్, యోగా, కరాటే, సామాజిక అంశాలు, వ్యక్తిత్వ వికాసం, తెలుగు, ఆంగ్లం, సైన్స్, సోషల్, గణితం తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో భాగంగా 4 వారాల పాటు బాలికలకు ఉచిత వసతి, భోజనం తదితర సౌకర్యాలను ఎన్టీపీసీ అందిస్తోందన్నారు. అనంతరం బాలికలకు బ్యాగులు, బూట్లు, దుస్తులు, క్రీడా సామగ్రి, పాదరక్షకులు తదితర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ ఛటోపాధ్యాయ,యుఎస్ఎస్ సిఈడీశివకుమార్, సింహాద్రి జీజీఎమ్ సంజయ్ కుమార్ సిన్హా సంస్థ జీఎంలు, సీఎస్ఆర్ అధికారులు పాల్గొన్నారు.